

# కాదేదీ ప్రేమకనర్హం

ఫణీంద్ర

"చిరంజీవి చైతన్యకు,"

"నీ తండ్రి ఆశీర్వదించి వ్రాయునది. ఉభయ కుశలోపరి. ఈ మధ్య నీ వద్ద నుంచి ఉత్తరములు లేవు. కారణము తెలియదు. ముఖ్యంగా నీకు వ్రాయునది గోపాలరావు గారి వద్ద మనము తీసుకొన్న అప్పు వడ్డీతో కలుపుకుని లక్ష రూపాయలకు పైగా అయినది. మనము వ్రాసిన నోటుకు కాలపరిమితి వారము రోజులలో అయిపోవుచున్నది. మొన్న మన ఇంటికి వచ్చి అడిగినారు. ఆయన కొడుకులు • బాకీ వసూలు చేయమని వత్తిడి చేయుచున్నారట. లేదా ఇంటిని జప్తుకు పెట్టించమని గొడవ చేయుచున్నారని తెలిపినారు.

"నా తండ్రి, నేను కష్టపడి కట్టుకున్న ఇల్లు ఇది. నా అంతిమ శ్వాస ఈ ఇంటిలోనే వదలాలని నా కోరిక. నా కొడుకులు ముగ్గురు ఉండి, నేను కోర్టు చుట్టూ తిరగటం నాకు చాలా చిన్నతనం. జీవితంలో నా కంటూ ఏదీ మిమ్మల్ని కోరలేదు. మన ఇంటిని నిలబెట్టి నా కోరిక తీరుస్తారని ఆశిస్తాను. అమ్మ కులాసాగాయున్నది. చి॥సౌ॥ కోడలుకు, పిల్లలకు నా ఆశీస్సులు. నీ రాకకై ఎదురు చూస్తూ -

"నీ తండ్రి

"రాఘవయ్య.

"ఏం చేద్దామనుకుంటున్నారు" అడిగింది భార్య స్వప్న.

"ఆలోచించాలి. ఇది అని ఒక నిర్ణయం" అంటూ ఏదీ లేదు నా మనసులో. నా తమ్ముళ్ల అభిప్రాయం కూడా తెలుసుకోవాలి" అన్నాడు చైతన్య ఉత్తరం భార్య చేతికిస్తూ -

* *

గత రెండు సంవత్సరాలుగా నలుగుతున్న సమస్య ఇది. పల్లెటూళ్లో ఉన్న ఆ ఇంటిని అమ్మి వేసి, చెల్లెలి పెళ్ళి నిమిత్తం చేసిన అప్పు తీర్చేసి తల్లిదండ్రులను తన వద్దకు తీసుకు వద్దామని చాలాసార్లు ప్రయత్నం చేశాడు చైతన్య. కాని తండ్రి మాట కాదనలేక ఆ ఇంటిని అమ్మటం సాగటం లేదు.

కారణం ఆ ఇంటితో రాఘవయ్య గారికి ఉన్న అనుబంధం, ప్రేమ చెప్పనలవి కాదు.

రాఘవయ్య గారి తండ్రి తన సంపాదనతో తనకంటూ ఒక ఇంటిని కట్టుకోలేక పోయారు. తన సంపాదనలో దాచుకున్న కొద్ది డబ్బు రాఘవయ్య గారి చేతికి ఇస్తూ -

"ఒరేయ్ అబ్బాయ్! నా సంపాదనతో నీ ఇద్దరి అక్కలకు, చెల్లెలికి పెళ్లిళ్లు చేయగలిగాను. నీకు ఆ బాధ్యత అప్పచెప్పలేదు. కాని ఒకే ఒక బాధ్యత అప్ప చెబుతున్నాను. నేనెలాగూ ఇల్లు కట్ట లేక పోయాను. నీవైనా ఒక ఇల్లు కట్టి నా కోరిక తీర్చరా! నీవు కట్టిన ఇంట్లోనే నా రోజులు గడిచి పోవాలి" అన్నారు రాఘవయ్య గారి తండ్రి.

అప్పటికి రాఘవయ్య గారి వయస్సు 22 ఏళ్లు. కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు. అప్పటి నుంచి తనకు వచ్చే జీతంలో కొంత మిగిల్చి, సాయంత్రం పూట ప్రైవేట్లు చెప్పి కొంత కూడబెట్టేవారు. రాఘవయ్య గారి తండ్రి కూడా పార్ట్‌టైముగా అకౌంట్లు వ్రాసి వచ్చిన డబ్బు కొడుకు చేతికి ఇచ్చేవారు. అలా కష్టపడి రాఘవయ్య గారికి 27 ఏళ్లు వచ్చే నరికి ఆ ఇంటిని కట్టడం జరిగింది. ఆ ఇల్లు కట్టిన తరువాతే రాఘవయ్య గారికి పెళ్లి జరిగింది.

అప్పటి నుంచి ఆ ఇంటి మీద రాఘవయ్య గారికి ప్రేమాభిమానాలు పెరుగుతూనే వచ్చాయి. కష్టపడి కట్టుకున్న ఇల్లు తన తండ్రి కోరికకు

ప్రతిరూపం. తన తండ్రి లాగే తను కూడా అందులోనే కాలధర్మం చెందాలని ఆయన కోరిక.

* *

మరునాడు రాత్రి ఎనిమిది అయింది చైతన్య ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి.

వస్తూనే హాల్లో ఉన్న తమ్ముళ్లను చూసి కొంత ఆశ్చర్య పోయి అడిగాడు. "ఎంత సేపయిందిరా వచ్చి" అని.

"ఒక గంట అయింది అన్నయ్యా" ఇద్దరూ ఏక కంఠంతో పలికారు.

"కూర్చోండి వస్తాను" అంటూ లోపలికి వెళ్లాడు చైతన్య.

బాత్ రూములో కాళ్లు కడుక్కుంటూ అడిగాడు చైతన్య తువ్వాలు పట్టుకుని నిలుచున్న స్వప్నని.

"ఎందుకు వచ్చారుట ఇద్దరూ అర్జంటుగా?"

"తెలియనట్టు అడుగుతారేం? మీకు వ్రాసినట్టుగానే వాళ్లకు కూడా ఉత్తరాలు వ్రాశారుట మీ నాన్నగారు."

"ఏమిటట వాళ్ల అభిప్రాయం?"

"ఏమో నాకేం తెలుసు? మీరే అడగండి" అంది స్వప్న.

"వదిన గారివి కదా! ఏమైనా చెప్పేరేమోనని."

"భోజనాలు చేస్తూ మాట్లాడుకోవచ్చు. వాళ్లు కూడా ఇంకా భోజనం చేయలేదు." తువ్వాలు అందించి వంటింట్లోకి దారి తీసింది.

భోజనాలు దగ్గర కూర్చున్నాక అన్నాడు పెద్ద తమ్ముడు వాసు.

"నాన్నగారు ఉత్తరం వ్రాశారు అన్నయ్యా."

"ఏమని" అడిగాడు చైతన్య.

కొంత ఆశ్చర్య పోయి చూశాడు వాసు. 'నీకు రాలేదా?' అన్నట్టుగా!

"ఆ ఏముంది? ఎలాగైనా సరే! మన ఇంటిని నిలబెట్టండి లేక పోతే మనశ్శాంతి ఉండదు అని. ఇంకా ఏవేవో వ్రాశారు మనను బాధపడేలా. ఏమిటో ఈ చాదస్తాలు. మనం సంపాదించుకున్నవి అన్నీ మిగులుతాయని గ్యారంటీ ఏమిటి?"

"చాదస్తం కాదయ్యా! ఆ ఇల్లు ఆయన కష్టపడి కట్టుకున్నది. దాని విలువ ఆయనకి తెలుస్తుంది కాని మనకు తెలియక పోవడంలో ఆశ్చర్యం లేదు."

"వదినా! నువ్వు కూడా చాదస్తంగా మాట్లాడకు. నమస్యను ఇలా సాగదీస్తూ వడ్డీ పెంచుకునే బదులు ఇల్లు అమ్మేసి అమ్మని నాన్నని ఇక్కడకు తీసుకు వస్తేనే మంచిది."

"ఇప్పటికే చాలా మంది అంటున్నారు. ఆ పల్లెటూళ్లో ఆ ముసలి వాళ్లని ఎంత కాలం ఉంచుతారయ్యా అని. "ఏరా ఏమంటావ్" అని తమ్ముడు కేసి చూశాడు వాసు.

"పెద్దన్నయ్య అభిప్రాయమే నా అభిప్రాయం" చెప్పాడు రఘు. చైతన్య నిర్ణయం తెలుపమన్నట్లుగా.

"నీ అభిప్రాయం ఏమిటోయ్" అడిగాడు చైతన్య స్వప్నని.

"నా అభిప్రాయం దేనికి? కొడుకులు మీరు. ఆలోచించవలసింది మీరు. ఆచరించవలసింది మీరు."

"అహా! ఏం లేదు. ఆడవాళ్లు హృదయంతోటి, మగవాళ్లు మెదడుతోటి ఆలోచిస్తారని ఓ మహానుభావుడు చెప్పినట్లు గుర్తు. అందుకని."

"పాటిస్తారా?" మాటివ్వమని అడిగినట్లుగా అడిగింది స్వప్న.

"చెప్పు చూద్దాం!" - చైతన్య.

"అప్పుతీర్చేసి మీ నాన్నగారి కోరిక తీర్చండి."

"వదినా! నువ్వు మళ్లీ మొదటికే వస్తున్నావ్!" అన్నాడు వాసు.

"మొదటికి కాదయ్యా! చివరికి ఇదే జరగాలి. బ్రతికినంతకాలం ఆయన్ని ఆనందంగా బ్రతకనివ్వండి."

భోజనాలు ముగించి అన్నదమ్ములు ముగ్గురూ హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

"నువ్వు ఇంకేమీ ఆలోచించకు అన్నయ్యా! ఇల్లు అమ్మకం పెట్టు ఈ చాదస్తాలు ఎప్పుడూ ఉండేవే. రేపో మాపో నువ్వు ఇల్లు కట్టబోతున్నావు. ఏం? అది ఆయనది కాదా? కొడుకు కట్టిన ఇంట్లో ఉండడం పాపమా?"

"అని మన కోణం నుంచి మనం ఆలోచిస్తున్నాం! ఆయన ఆలోచించాలి కదా!" అంటూ వచ్చి కూర్చుంది స్వప్న.

"ఆయన ఆలోచించరు. మనం నచ్చచెప్పాలి. సెంటిమెంట్లు పట్టుకుని వేళ్లాడుతూ కూర్చుంటే జీవితాలు ముందుకు వెళ్లటం కష్టం" అన్నాడు వాసు.

"ఒక సారి ఆలోచించండయ్యా! ఆయన్ని నొప్పించటం మంచిది కాదు."

"ఏమిటి వదినా! నీకు ఆయనకంటే చాదస్తం ఎక్కువయిపోయింది. నువ్వు మన వైపు నుంచి ఆలోచించవేం? ముగ్గురం మూడు చోట్ల ఉద్యోగాలు. వాళ్లిద్దరూ అక్కడ ఎలా ఉన్నారో? ఏమిటో అని టెన్షను. నెల రోజులకొకసారి ఎవళ్లో ఒకళ్లం వెళ్ళి చూసి రావటం, ప్రయాణాలు, టెన్షను, ఇవన్నీ ఎందుకు? వాళ్లిద్దరూ ఇక్కడే ఉంటే ఇవన్నీ ఉండవుగా! ఒక రోజు బాధపడతారు. రెండు రోజులు బాధపడతారు. తరువాత రొటీన్‌లో వాళ్లే మరచిపోతారు."

"అన్నయ్యా! వది ఆలోచనలు చేయకు. నువ్వు కూడా సెంటిమెంటు గురించి ఆలోచిస్తే అమ్మా నాన్న అక్కడి నుంచి కదలిరారు. ఏదో విధంగా నచ్చచెప్పి తీసుకురా! మనకు ఈ టెన్షనులు ఉండవు. ఆలోచనలు ఉండవు."

"సరే పడుకోండి రేపు ఆలోచిద్దాం! మిగత కార్యక్రమాల గురించి" అంటూ తన పడక గదిలోకి దారి తీశాడు చైతన్య.

పడుకున్న తరువాత అడిగింది స్వప్న చైతన్యని.

"మీ నిర్ణయం అదేనా!"

"అదే మంచిదని నాకూ తోస్తోంది. వాసు మాటలను బట్టి చూస్తుంటే కొద్దో గొప్పో డబ్బు సర్దుబాటు చేసే వాడే లేడు పోనీ అప్పు తీరుద్దామంటే! రఘు నిన్న కాక మొన్న ఉద్యోగంలో చేరిన వాడు."

"పోనీలెండి! మీరు తీర్చగలరు కదా."

"తీర్చగలను. మన ఇల్లు కట్టుకోవటం వాయిదా పడుతుంది."

"మహా అయితే రెండు సంవత్సరాలు ఆలస్యమవుతుంది. అంతేనా?"

"అది నాకు ఇష్టం లేదు. ఇప్పటికే చాలా మందికి చెప్పుకున్నాను, త్వరలో ప్రారంభిస్తానని! అయినా వాసు చెప్పింది కూడా మంచిదే. వాళ్లిద్దరిని ఇక్కడకు తీసుకువచ్చేస్తే అందరం కలిసి ఒకేచోట ఉండొచ్చు. వాళ్లు ఎలా ఉన్నారని బెంగలు ఉండవు. ఇక పడుకో" అన్నాడు చైతన్య.

స్వప్న ఇక మాట్లాడ లేదు.

* *

"రండి రండి"....లోపలికి వస్తున్న గోపాల రావుగారిని చూసి సాదరంగా ఆహ్వానించాడు చైతన్య.

"ఊరునుంచేనా రావటం?" అడిగాడు చైతన్య.

"ఆ మన వూరి నుంచేనయ్యా! ముగ్గురూ ఇక్కడే దొరకటం నా అదృష్టం" అన్నారు గోపాలరావు గారు ముగ్గుర్నీ చూసి.

"మా అమ్మగారు, నాన్నగారు కులాసాయేనాండి" అడిగాడు చైతన్య.

"శరీరం కులాసాయే! పాపం! మనసే బావుండటం లేదు."

"గోపాలరావు గారూ! సూటిగా చెప్పండి" విసుగ్గా అన్నాడు వాసు.

"సూటిగానే వస్తున్నానయ్యా! కోపం తెచ్చుకోకు."

"కాఫీ తీసుకోండి" అంది స్వప్న.

కాఫీ గ్లాసు అందుకుని -

"నా కొడుకులు వస్తారు. అప్పు తీర్చేస్తారు అని ఆశతో ఎదురు చూస్తున్నారు."

"లేదండి! ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నాము బేరం చూడండి" అన్నాడు వాసు.

"బేరాలకి ఏముందయ్యా! సిద్ధంగా ఉన్నాయి. మీ నాన్నగారిని ఒప్పిస్తే రేపే అగ్రిమెంటు



వ్రాయించేస్తాను. ఆయన ఒప్పుకోవాలి కదా!"

"నాన్న గారు ఒప్పుకోరు మాకు తెలుసు. ఒప్పించి తీరాలి. ఈ వయసులో వాళ్లని అక్కడ ఉంచటం మాకు సుతరామూ ఇష్టం లేదు."

"ఏమయ్యా! ఇలా రెండేళ్లుగా సాగుతోంది. మీరు అమ్మేస్తామనటం, ఆయన వద్దనటం. కథ మళ్లీ మా మూలే! ఈ జన్మకు నా బాకీ తీరదు."

"అలా భావించకండి. ఈ సారి మేము గట్టి నిర్ణయం తీసుకున్నాము. మీరు కూడా నాన్నగార్కి నచ్చచెప్పండి."

" ఆ బాధ్యత నామీద పెట్టకండి." నేను ఆయన్ని నొప్పించలేను. నేను మీకు చేసే ఉపకారం ఒక్కటే! వడ్డీ నగానికి నగం తగ్గించేస్తాను. నేను వడ్డీ వ్యాపారస్తుడిని కాదు. మీ నాన్నగారికి స్నేహితుడుగానే ఇచ్చాను. భగవంతుడి దయవల్ల నాకు దేనికీ లోటులేదు. మీరు ఎలా తీర్చినా నరే! నా కొడుకుల దగ్గర నా గౌరవం నిలబెట్టండి. కాని అమ్మే ముందు ఒకసారి ఆలోచించి నిర్ణయం తీసుకోండి."

"ఇక ఆలోచించటాలు ఏమీ లేవండి." అన్నాడు వాను.

"అయితే ఎప్పుడు వస్తారు? ముగ్గురూ రావలసి ఉంటుంది.?

"ఎల్లుండి వస్తాము" అన్నాడు చైతన్య.

"నరే అయితే! మీరు ఇదివరలో చెప్పిన రేటుకి పదో, పదిహేనో తక్కువకి మనవూరి మునసబు గారు సిద్ధంగా ఉన్నారు. మీ కిష్టమేనా?" అడిగార్లు గోపాలరావు గారు.

"అలాగే కానివ్వండి." అన్నాడు చైతన్య.

"నరే అయితే! నేను బయలుదేరుతాను. ఎల్లుండి మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాను. మీరు వచ్చిన తరువాతే అగ్రిమెంటు వ్రాయిస్తాను." అని సెలవు తీసుకున్నారు గోపాలరావు గారు.

"అన్నయ్యా భోజనాలు చేసి మేము కూడా బయలు దేరితాము."


"అదేంరా! ఈ వేళ ఆదివారమే కదా!

"లేదన్నయ్యా! చాలా వనులు ఉన్నాయి. ఎల్లుండి మేము అలా మనవూరు వచ్చేస్తాం. "

"నరే మీ ఇష్టం!" అన్నాడు చైతన్య.

* *

"స్వ్వ..." అరిచినట్టుగానే పిలిచాడు చైతన్య.




"ఏమండీ" అంటూ వచ్చింది స్వప్న.

"నా పెన్ను కనబడటం లేదు. నువ్వు తీశావా?

"లేదు। నరిగ్గా చూసుకోండి"

"అంతా వెదికాను. కనబడలేదు. ఏరి పిల్లలు? వాళ్ళుగాని తీశారేమో?" అంటూ హాల్లోకి వచ్చాడు.

తండ్రి మాటలు విన్న పిల్లలు ఇద్దరూ లేచి నించున్నారు.

"నా పెన్ను గాని తీశారా?" అడిగాడు చైతన్య వాళ్ల పుస్తకాలు, మొహాలూ పరిశీలనగా చూస్తూ -

"లేదు." తల అడ్డంగా తిప్పారు.

"నిజం చెప్పండి. లేక పోతే దెబ్బలు తింటారు."

"వాళ్ల నెందుకండి భయపెడతారు తీయలేదు అంటున్నారు గదా!"

"నువ్వు వెనకేసుకురాకు ఆ పెన్నుతో వ్రాయటం, పాళీలు విరగొట్టటం వీళ్లకి అలవాటేగా!"

"మీరే ఎక్కడో పెట్టి మరచి పోయి ఉంటారు. వీధిలో వడేసి దొడ్లో వెతుక్కోవటం మీకు అలవాటేగా! ఆఫీసులో మరచి పోయారేమో చూసుకోండి" అంది స్వప్న.

"నువ్వు కూడా ఇంట్లో వెతుకు. ఒరేయ్ మీరు గాని తీస్తే అమ్మకి ఇవ్వండి. నేను ఏమీ అనను. సాయంత్రం నేను ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి పెన్ను ఉండాలి." ఆర్డరు జారీ చేసి బయలు దేరాడు ఆఫీసుకి.

* *

సాయంత్రం ఆరు గంటలు అయింది. ఆఫీసు కొలీగ్‌తో ఇంటికి వచ్చాడు చైతన్య.

"బాగున్నారా అన్నయ్యా" వచ్చిన వ్యక్తిని వలకరించింది స్వప్న.

"ఆ కులాసాయేనమ్మా" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ -

"కాఫీ తెస్తాను కూర్చోండి" అంటూ లోపలికి వెళ్లింది స్వప్న.

వాళ్లిద్దరూ ఆఫీసు విషయాల్లో నిమగ్నమయ్యారు.

అయిదు నిమిషాల తరువాత కాఫీలు తీసుకు వచ్చి బల్లమీద పెట్టింది స్వప్న.

"కాఫీ తీసుకోరా." అంటూ తనూ తీసుకున్నాడు చైతన్య.

కాఫీ తాగుతూ అడిగాడు చైతన్య స్వప్నని "పెన్నుదొరికిందా?"

"లేదు. ఇల్లంతా వెదికాను."

"అది దొరకదు. మన వెధవలే ఎక్కడో పారేసి ఉంటారు." విసుక్కున్నాడు చైతన్య.

"వీడి పెన్ను కాదుకాని సిస్టర్. ఈ రోజు ఆఫీనంతా కెలికి వదిలిపెట్టాడు. అందరి సొరుగులూ సోదా చేశాడు. కొంత మందికి కోపాలు కూడా వచ్చాయి."

"ప్రొద్దుట ఇంట్లోనూ అయ్యింది అన్నయ్యా. శివతాండవం."

"ఒరేయ్ ఏమహ అయితే అయిదు రూపాయలు ఖరీదు చేస్తుంది నీ పెన్ను దానికి ఇంత బాధపడిపోతావా? కొత్తది కొనుక్కోవచ్చు కదా!" అన్నాడు ఆఫీను కొలీగ్.

"దాన్ని నువ్వు రూపాయలతో విలువ కట్టేవు. నిజానికి దాని విలువ నీకు తెలియదు. నేను 6వ తరగతి లోకి వచ్చిన తరువాత మా నాన్నగారు నాకు కొని ఇచ్చిన పెన్ను అది. నా చదువంతా దానితోనే సాగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ పెన్ను చెక్కు చెదరలేదు. అది నా దగ్గర ఉంటే మా నాన్నగారు నా దగ్గర ఉన్నంత ఆనందపడతాను. అది పోయింది అంటే చాలా వెలితిగానే ఉంది."

"నరేలే నీ సెంటిమెంటు బాగానే ఉంది. ఇక నేను వెళ్లొస్తా "నంటూ వెళ్లిపోయాడు అతను.

అతను వెళ్లిపోయిన తరువాత మళ్లీ అడిగాడు చైతన్య స్వప్నని.

"నిజంగా కనబడలేదా?"

"కనబడితే ఇవ్వనా?" కొద్దిగా కోపంగానే అంది.

"అంతే! ఈ ఇంట్లో పెట్టిన వస్తువు పెట్టిన చోట ఉండదు"

"నర్లేండి! తరువాత సాధిద్దురు గాని ముందు భోజనానికి లెండి" అంటూ వంటింట్లోకి దారి తీసింది.

భోజనాలు అయిన తరువాత స్వప్న వడకగదిలో ఏదో నర్దుతూ కూర్చుంది. చైతన్య మంచం మీద వడుకుని పుస్తకం చదువుతున్నాడు.

"ఏవండీ" నంతోషంతో కేక వేసినట్లుగా పిలుస్తూ మంచం దగ్గరకు వచ్చి -

"ఇదిగో మీ పెన్ను" అంటూ చేతిలో పెట్టింది స్వప్న.

"ఎక్కడ దొరికింది" అడుగాడు చైతన్య పోయిన పెన్నిధి తిరిగి పొందినంత ఆనందంతో.

"సొరుగులోనే ఉంది. పుస్తకాల అడుగున దాక్కున్నారు మీ నాన్నగారు. మీకు హడావుడి తప్ప నరిగ్గా వెతకటం తెలీదు కదా!"

"నర్లేవోయ్ సొరుగులో పెట్టిరా!" అన్నాడు చైతన్య చేతికిస్తూ.

పెన్ను డ్రాయర్లో పెట్టి, పిల్లల్ని వడుకోబెట్టి, లైటు ఆర్పి తనూ వచ్చి వడుకుంది స్వప్న.

గదిలో బెడ్ లైటు వెలుగుతోంది.

"ఏవండీ"! నెమ్మదిగా పిలిచింది స్వప్న.

"ఊ"! అన్నాడు చైతన్య.

"ఒక్క మాట అడుగుతాను నూటిగా నమాధానం చెబుతారా?"

"అడుగు"

"పెన్ను పోయిందని మీరు చాలా ఫీలయ్యారు కదా!"

"అవును"

"ఒక్క చిన్న పెన్ను గురించి మీరు

ఇంత బాధ వద్దూరే! ఎంతో కష్టపడి కట్టుకున్న ఇల్లు గురించి మీ నాన్నగారు ఎంత బాధపడతారో ఒకసారి ఆలోచించండి."

"అది...." ఏదో అనబోయాడు చైతన్య.

"నేను చెప్పేది పూర్తిగా వినండి, అది వేరు, ఇది వేరు అనకండి."

"కొన్ని వస్తువులు కొంత మంది జీవితాలతో ముడిపడి ఉంటాయి. ఎందుకు అంటే సరి అయిన కారణం చెప్పలేము. ఆ వస్తువుకి, ఆ వ్యక్తికి మధ్య జరిగిన సంఘటన బట్టి ఆధారపడి ఉంటుంది.

"కష్టార్జితం కావచ్చు, లేదా ఇష్టమైన వ్యక్తి బహుమతిగా ఇచ్చి ఉండవచ్చు. అటువంటి వస్తువులకు డబ్బుతో విలువ కట్టలేరు ఆ వ్యక్తులు.

"పెన్ను పోతే మీరు బాధపడటం చూసి మీ మిత్రుడు దానికి సెంటిమెంటు అని పేరు పెట్టాడు. కాని దాని మీద మీకు ఉన్నది సెంటిమెంటు కాదు ప్రేమ. పాతిక సంవత్సరాలు మీతో సహజీవనం చేసింది. మీకు ఇష్టమైన వ్యక్తి మొదటి సారిగా కొని ఇచ్చిన పెన్ను. తరువాత మీరు ఉద్యోగం వచ్చిన తరువాత చాలా పెన్నులు కొన్నారు. చాలా పోయాయి కూడా. దేనికీ, దానికి ఇచ్చినంత విలువ మీరు ఇవ్వలేదు.

"కాదేదీ కవిత కనర్హం అని శ్రీశ్రీ అన్నట్లు.

"కాదేదీ ప్రేమ కనర్హం అని నేనంటాను.

"ప్రేమించే హృదయం ఉండాలే కాని, మనం వాడుకునే టూత్ బ్రష్‌ని కూడా ప్రేమించవచ్చు. ప్రేమనేది మానవుడికి తోటి మానవుల మీదే కాదు వస్తువుల మీద కూడా ఉంటుంది.

"ఆడవాళ్లు హృదయంతో ఆలోచిస్తారు అన్నారు కదా! ఆడవాళ్లే కాదు మగవాళ్లు కూడా ఆలోచించవచ్చు. అదంటూ ఉండాలేకాని.

"దీనిని బట్టి ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోండి. తరువాత మీ ఇష్టం" అంటూ అటు తిరిగి పడుకుంది స్వప్న.

ఒక్క నిమిషం నిశ్శబ్దం.

చైతన్య హృదయంలో చిన్న కదలిక ప్రారంభం అయింది.

* *

మరునాడు ఉదయం నిద్రలేచి హాల్లో కూర్చున్నాడు చైతన్య. కాఫీపట్టుకొచ్చి చైతన్యకిచ్చి తనూ పక్కన కూర్చుంది స్వప్న.

చైతన్య కాఫీ తాగటం పూర్తయ్యాక అడిగింది. " ఏమాలోచించారు"?

ఒక్క అరనిమిషం నిశ్శబ్దం.

"బట్టలు సర్దు అందరం వెళదాము. నేను బ్యాంకుకి వెళ్లి డబ్బు డ్రా చేసి తీసుకు వస్తాను." అన్నాడు చైతన్య.

స్వప్న ఆప్యాయంగా చైతన్య చేయి మీద చేయివేసింది. చైతన్య మనసు నిండుగా అయింది.

"ఏమండీ మీరు ఏమీ అనుకోక పోతే ఒక్క విషయం."

"చెప్పు" అన్నాడు చైతన్య.

"మీ పెన్ను నిజంగా పోలేదు నేనే దాచాను"

"ఊహించాను. ఒకటి మాత్రం తెలుసుకున్నాను."

"ఏమిటది?" అడిగింది స్వప్న.

"మనిషికి మానసిక విశ్లేషణ అవసరమ"ని అంటూ ఎక్కడో ముద్దు పెట్టబోయాడు.

"ఈ విశ్లేషణ ఇప్పుడొద్దు వదండి బ్యాంకుకి టైము అవుతోంది." అంది నవ్వుతూ.

"అవును పద పద"... అనుసరించాడు చైతన్య.

